సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 6 । ఆగస్టు । 2023



నవోదయ విద్యాలయాల్లో క్రీడలకు ప్రాధాన్యం

నవోదయ విద్యాలయాల్లో విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు రిటైర్డ్ నవోదయ అధికారి పీఆర్ ప్రసాద్ అన్నారు. -10లో



ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి

ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన కేవీపల్లె మండలంలోని సొరకాయలపేట చెరువు కట్ట సమీపంలో చోటు చేసుకుంది. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.900	రూ.1000
రెండోరకం	రూ.760	రూ.890

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 195 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	444	484
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 354.100 కిలోలు

న్యూస్‌రీల్

కోదండ రామయ్యకు స్నపన తిరుమంజనం



ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణ మూర్తులు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామ స్వామి దేవాలయంలో శనివారం స్వామి వారికి వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ స్నపన తిరుమంజనం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ టీటీడీ అధికారులు ఆధ్వర్యంలో సుప్రభాత సమయాన శ్రీరామచంద్రమూర్తికి పట్టు వస్త్రాలు, సమర్పించారు. సీతారామలక్ష్మణ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు.

9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

రాయచోటిటౌన్: జిల్లా కార్యాలయంలోని స్పందన భవనంలో ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కె. అబ్బలోము శనివారం తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి గిరిజన ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.

21న 'ఏపీ ఎన్జీఓ' రాష్ట్ర కౌన్సిల్ మహాసభలు

కడప రూరల్: విజయవాడలో ఈ నెల 21, 22వ తేదీల్లో ఏపీ ఎన్జీఓ అసోషియేషన్ 21వ రాష్ట్ర కౌన్సిల్ మహాసభలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శనివారం కడప కలెక్టరేట్‌లో వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఆవిష్కరించారు.

తంబళ్లపల్లెపై పచ్చ కుట్రలు!

- శాంతిభద్రతల సమస్యను సృష్టించి లబ్ధిపొందే ప్రయత్నాలు
- కోటకొండ, కొంగావారిపల్లె ఘటనలకు టీడీపీయే కారణం
- అంగళ్లులో చంద్రబాబు సమక్షంలో జీభత్సం

బి.కొత్తకోట: ప్రశాంత వాతావరణానికి పెట్టింది పేరైన అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గంపై ప్రతిపక్ష టీడీపీ పచ్చ కుట్రలకు పాల్పడుతోంది. అశాంతి, అలజడులు సృష్టించడం పార్టీకి సానుభూతి, మద్దతు కూడగట్టుకునే వ్యూహాలకు తెరతీసింది. 2019 అసెంబ్లీ ఎన్నికల తర్వాత టీడీపీ బలం అధఃపాతాళానికి దిగజారింది. మళ్లీ బలం పుంజుకోవడం కోసం ఆ పార్టీ నేతలు పన్నాగాలు పన్నుతున్నారు. ఇటీవల నియోజకవర్గంలో పలు ఘటనలకు టీడీపీ నాయకులు కారకులైతే ఆ నెపాన్ని వైఎస్సార్‌సీపీ నేతలపైకి నెట్టి టీడీపీకి సానుభూతి రావడం కోసం ప్రచారం చేసుకుంటున్నారు. దీనికి ఉదాహరణ శుక్రవారం కురబలకోట మండలం అంగళ్లులో జరిగిన ఘటన. చంద్రబాబు సాక్షిగా ఆయన చూస్తుండగా వందలాది మంది టీడీపీ కార్యకర్తలు మూకుమ్మడిగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడికి పరుగులు తీశారు. ఇదంతా జీపుపై నిలబడిన చంద్రబాబు చూస్తూనే ఉన్నారు. 2014 వరకు తంబళ్లపల్లె టీడీపీకి బలమైన నియోజకవర్గం. 2019లో పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీచేసి 46,938 ఓట్లతో టీడీపీ అభ్యర్థి జి.శంకర్‌ను చిత్తుగా ఓడించడం చంద్రబాబు నుంచి స్థానిక నేతలు జీర్ణించుకోలేకపోయారు. నియోజకవర్గంలో మళ్లీ పట్టు సాధించడం కోసం వ్యూహాలకు పదును పెట్టారు. రాజకీయంగా నేరుగా ఢీకొనే పరిస్థితి లేక కుట్ర రాజకీయాలు మొదలు పెట్టారు.

- శుక్రవారం మధ్యాహ్నం అంగళ్లుకు వచ్చిన చంద్రబాబు వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ కార్యకర్తల దాడిని నివారించలేదు. కూడలిలో జీపుపైకి ఎక్కి ప్రసంగిస్తుండగా ఆయన సమక్షంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడికి వందలసంఖ్యలో టీడీపీ కార్యకర్తలు పరుగులు తీసి వెళ్తున్నా, రాళ్లు, కర్రలతో దాడి చేస్తున్నా పట్టించుకోలేదు. తొడలు కొడుతూ, మీసాలు మెలేస్తూ, చెప్పులు చూపిస్తూ కొట్టుకుందాం రండీ అంటూ సవాల్ చేశారు. టీడీపీ కార్యకర్తలు. రెచ్చగొడుతూ దూసుకొస్తూ దాడులకు తెగబడ్డారు. ఈ మూకల దాడిలో ముదివేడు కానిస్టేబుల్ కేశవ, అంగళ్ల వైఎస్సార్‌సీపీ కార్యకర్త అర్జున్‌రెడ్డి, మరికొందరు గాయపడ్డారు. చంద్రబాబు సమక్షంలో..ఆయన చూస్తుండానే ఇదంతా జరిగినా వైఎస్సార్‌సీపీ శ్రేణులే దాడులు చేశారని ప్రత్యారోపణలు చేయడం ఆయనకే చెల్లు. తన పార్టీ శ్రేణుల దాడిని సమర్థించుకోవడమేకాక పోలీసులపై ఆరోపణలు చేశారు.



అంగళ్లులో చంద్రబాబు జీపుపై ప్రసంగిస్తుండగా.. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను రెచ్చగొట్టేలా తొడకొడుతున్న టీడీపీ నేత

- అంగళ్లు మదనపల్లెరోడ్డులో జరిగిన ఘటనకు టీడీపీలో జాతీయస్థాయి పదవులు పొందిన నాయకులే కారణం. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలు చేసి రెచ్చగొట్టారు. దీనిని ప్రశ్నించేందుకు ప్రయత్నించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులపై పథకం ప్రకారం దాడిచేసి ఆ ఘటనను వైస్సార్‌సీపీ పైకి నెట్టేశారు. ఈ దాడిలో తాము ఏదో సాధించామని చెప్పుకొని టీడీపీలో పార్టీ పదవులు పొందారని ఇటీవల వైరల్ అయిన వీడియోలో ఆ పార్టీ నాయకులు అసలు రూపం బయటపడింది.
- గత డిసెంబర్ 22న తంబళ్లపల్లె మండలం కోటకొండలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనులకు సంబంధించి పర్యటన చేస్తుంటే..అదే సమయంలో కావాలని టీడీపీ నేతలు సభపేరుతో అక్కడికి వచ్చి అనుచిత వ్యాఖ్యలు, రెచ్చగొట్టే సవాళ్లు చేసి తీవ్ర ఉద్రిక్తత సృష్టించారు. టీడీపీ జెండా కర్రల పేరుతో ఆటోలో కర్రలను తీసుకురావడం గుర్తించారు. ఈ ఘటన లో బాధితులు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు అయినప్పటికీ సంయమనం పాటించారు. అప్రమత్తమైన పోలీసులు కోటకొండకు వెళ్తున్న టీడీపీ మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌ను ముదివేడు వద్ద ఆపి పరిస్థితిని వివరించి పర్యటన వాయిదా వేసుకోవాలని విన్నవించగా శాంతిభద్రతల దృష్ట్యా ఆయన అంగీకరించి వెనుదిగి వెళ్లారు. అంతటితో సమస్య సద్దుమణిగింది.
- మరుసటి రోజు డిసెంబర్ 23న టీడీపీ నేత కొండ్రెడ్డి అసలు జరగని గొడవలో టీడీపీ నేతల పరామర్శ పేరుతో కురబలకోట మండలం ఎగువ కొంగావారిపల్లెలో టీడీపీ కార్యకర్తలను కలిసేందుకు వెళ్తూ కొండ్రెడ్డి, అతని అనుచరులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు చలపతినాయుడు, శ్రీకాంత్‌రెడ్డిపై దాడులు చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ దాడి ఫ్యాక్షన్ సినిమాను తలపించింది. ఇటుకలు, రాళ్లతో దాడులు చేశారు. తీవ్రమైన ఈ ఘటనకు వైఎస్సార్‌సీపీ నేతలపైనే నెపంవేసి సానుభూతి పొందే ప్రయత్నాలు చేశారు. టీడీపీ నేత కొండ్రెడ్డి, అతని అనుచరులు నిందితులుగా ఉన్న కేసులో వారికి మద్దతుగా టీడీపీ నేత నారాలోకేష్ మరుసటి రోజు ట్వీట్టర్‌లో వీరిని వెనుకేసుకొచ్చారు.



టీడీపీ దాడిలో తలపై తీవ్రగాయమైన కానిస్టేబుల్ కేశవ



గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త అర్జున్‌రెడ్డి

▶▶బాబు, లోకేష్ విష ప్రచారాలు

నియోజకవర్గంపై పట్టు సాధించి, టీడీపీ అవకాశం లేకుండా చేసిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని ఇబ్బంది పెట్టాలని టీడీపీ నేతలు ఎన్నో విష ప్రచారాలకు బీజం వేశారు. తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. యువగళం పాదయాత్రకు వచ్చిన లోకేష్..ములకలచెరువులో జరిగిన సభలో ప్రజల మద్దతు కూడగట్టే ప్రయత్నాల కంటే ఎమ్మెల్యేను టార్గెట్‌ను మాట్లాడారు. వ్యక్తిగత విషయాలను ప్రస్తావించి ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని అది పార్టీకి అనుకూలమవుతుందని ఆశించారు. కొడుకు బాటలోనే చంద్రబాబు కూడా నడిచారు. శుక్రవారం ములకలచెరువు వచ్చిన చంద్రబాబు ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడానికే ప్రాధాన్యత ఇచ్చారు. ఇలా టార్గెట్ చేయడం ద్వారా ప్రజల్లో ఎమ్మెల్యేని బలహీనపర్చి టీడీపీ బలం పెంచుకునేలా పన్నాగాలు పన్నుతున్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి తొలి అడుగు



గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి ప్రారంభమైన పనులు

రాజంపేట టౌన్: కడప-రేణిగుంట మధ్య నిర్మించనున్న నాలుగులేన్ల గ్రీన్‌ఫీల్డ్ (ఎన్‌హెచ్-716) హైవే నిర్మాణ పనులకు తొలి అడుగు పడింది. రాజంపేట మండలం కూచివారిపల్లె సమీపంలో శనివారం గ్రీన్‌ఫీల్డ్ హైవే లైజనింగ్ ఆఫీసర్ హర్షాభిరామ్ ఆధ్వర్యంలో పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. 122.9 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఈ హైవే రోడ్డుకు కూచివారిపల్లె రెవెన్యూవిలేజ్ సెంటర్ పాయింట్ అయినందున తొలి సారిగా క్లీనింగ్ అండ్ గ్రబ్బింగ్ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. రెండు నెలల్లో ఈ పనులు పూర్తవుతాయన్నారు. రెండు ప్యాకేజీలుగా ఈ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుందన్నారు. కడప నుంచి చిన్నఓరంపాడు వరకు 64 కిలోమీటర్లు ఒక ప్యాకేజీ కింద, చిన్నఓరంపాడు నుంచి రేణిగుంట వరకు 59 కిలోమీటర్లు రెండోప్యాకేజీ కింద నిర్మాణ పనులు జరుగుతాయన్నారు. అయితే రెండు ప్యాకేజీల కింద జరిగే పనులు సమాంతరంగా చేపట్టనున్నట్లు తెలిపారు. కడప నుంచి రేణిగుంట వరకు నిర్మించే ఈమార్గంలో 52 లైట్ వెహికల్ అండర్ పాస్ (ఎల్‌వీయూపీ) బ్రిడ్జిలు, 8 వెహికల్ అండర్ పాస్ (వీయూపీ) బ్రిడ్జిలు, 72 మైనర్, మేజర్ బ్రిడ్జిలు, 240 కల్వర్టులు, మూడు రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జ్ (ఆర్‌ఓబీ)లను నిర్మించనున్నట్లు ఆయన చెప్పారు. హైవే నిర్మాణం కోసం చేపట్టిన భూసేకరణకుగాను దాదాపు 80 శాతం మందికి డబ్బులు చెల్లించే ప్రక్రియ కూడా పూర్తయినట్లు వివరించారు. కాగా హైవే నిర్మాణ పనులను శరవేగంగా చేపట్టేందుకు భారీ యంత్రాలను సిద్ధం చేశారు. ఈకార్యక్రమంలో వీఆర్‌ఓ జగదీష్, విలేజ్ సర్వేయర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

- ఈ హైవే నిర్మాణం పూర్తయితే తక్కువ సమయంలో కడప-తిరుపతి మధ్య రాకపోకలను సాగించవచ్చు. కడప-తిరుపతి మార్గంలో తరచూ అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ హైవే నిర్మాణ పూర్తయితే రోడ్డు ప్రమాదాలు చాలా వరకు తగ్గుముఖం పడతాయి.

'నా భూమి నాదేశం' విజయవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: జాతీయస్థాయిలో జరగబోయే 'నాభూమి నాదేశం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. 'నాభూమి నాదేశం' (మేరీ మాటి మేర దేశ్), జగనన్న సురక్ష, గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో, హౌసింగ్ ఈకేవైసీ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ ఆర్డీఓలు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా అధికారులతో శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నా భూమి నా దేశం అనే కార్యక్రమం ఆగస్టు 9వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా జరగబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో శిలాఫలకాలను ఏర్పాటు చేయడం, ప్రతిజ్ఞ చేయడం, మొక్కలు నాటడం, వీరులకు వందనం, జాతీయ జెండాను ఎగురవేయడం, మట్టిని సేకరించడం అనే ఆరు అంశాలుంటాయన్నారు. ఆగస్టు 9 కల్లా గ్రామ, మండల స్థాయిలలో శిలాఫలకాలను ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజా ప్రతినిధుల సమక్షంలో వలంటీర్లు సేవలను వినియోగించుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జిల్లా అటవీశాఖతో సమన్వయం చేసుకొని మూడో అంశమైన మొక్కలు నాటడం కార్యక్రమాన్ని చేపట్టాలని తెలియజేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించడం నాలుగో కార్యక్రమమని కలెక్టర్ అన్నారు. ఐదవ అంశంగా ఆగస్టు 15న జాతీయ జెండాను ఎగురవేయడం ఉంటుందన్నారు. ఆరో కార్యక్రమంలో భాగంగా అన్నమయ్య జిల్లాలోని 30 మండలాలలో మట్టిని సేకరించాలని అధికారులకు సూచించారు. గ్రాస్ ఎన్రోల్మెంట్ షో గురించి మాట్లాడుతూ ఎటువంటి తప్పులు లేకుండా ఎన్రోల్మెంట్ జరగాలని, పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు, వలంటీర్లకు తగు సూచనలు ఇవ్వాలన్నారు. జగనన్న సురక్ష పథకంపై సమీక్షిస్తూ పథకాలకు సంబంధించిన సమస్యలను వెల్ఫేర్ అసిస్టెంట్లు త్వరగా పరిష్కరించాలని, వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించాలని సూచించారు. గృహ నిర్మాణంపై సమీక్షిస్తూ విద్యుత్, నీటి సౌకర్యాలు వ్యాలిడేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో సుండుపల్లె తహసీల్దారు




ఏసీబీకి చిక్కిన తహసీల్దారు రవి, ఆర్‌ఐ కిరణ్

సుండుపల్లె(రాజంపేట): అన్నమయ్య జిల్లా సుండుపల్లె తహసీల్దారు గడపాల రవి శనివారం ఏసీబీవలలో చిక్కారు. 14400 కాల్‌సెంటర్‌కు ఫిర్యాదు వెళ్లడంతో ఏసీబీ అధికారులు వలవేసి పట్టుకున్నారు. వివరాలు.. సుండుపల్లె మండల ఎర్రమనేనిపాలెం గ్రామానికి చెందిన రైతు జీ.ప్రభంజనరెడ్డి తన పొలానికి మ్యుటేషన్ చేయడానికి తహసీల్దారు, ఆర్‌ఐలను కలిశారు. రూ.80వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దీనిపై కేసు నమోదు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో కడప అవినీతి నిరోధక శాఖ అధికారులు కాపుకాసి తహసీల్దారు రవి ఆదేశాల మేరకు ఆర్‌ఐ కిరణ్ బాధితరైతు నుంచి రూ.40 వేలు లంచంగా తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వచ్చి పట్టుకున్నారు. మ్యుటేషన్‌కు రూ.లక్ష డిమాండ్ చేసినట్లు బాధితుడు ఏసీబీ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు చట్టపరంగా తీసుకోవాల్సిన నిబంధనలను పూర్తి చేశారు. ఇరువురిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అంతకముందుగా తహసీల్దారు కార్యాలయంలో రికార్డులను ఏసీబీ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేశారు.

పూజారికి వరం

- ఆలయ ఉద్యోగులకు విరమణ వయస్సు 62ఏళ్లకు పెంపు
- హర్షం వ్యక్తం చేస్తున్న అర్చకులు, ఉద్యోగులు





మదనపల్లెలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం

మదనపల్లె సిటీ: ఆలయాల్లో అర్చకులపై వై.ఎస్.జగన్ ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచినట్లుగానే దేవదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు కూడా గరిష్ట వయస్సు 62కి పెంచుతూ నిర్ణయాన్ని ఆమోదించింది. అలాగే దేవాలయాల్లో పని చేస్తున్న అర్చకులు ఓపిక,శక్తి ఉన్నంతవరకు భగవంతుడి సేవలో కొనసాగేలా ప్రభుత్వం చారిత్రాత్మతక నిర్ణయానికి ఆమోదం తెలిపింది. అయితే ఈ రెండు నిర్ణయాలపై దేవదాయశాఖ ఉన్నతాధికారులు ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఇదిలావుంటే ఇప్పటికే అర్చకుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం..అనువంశిక హక్కులను కొనసాగించేలా కూడా ఇటీవల నిర్ణయాన్ని ప్రకటించారు. అర్చక విధుల్లో కూడా వయో అడ్డంకిని తొలగించడంతో అర్చక సమాఖ్య హర్షం ప్రకటించింది.

185 మందికి లబ్ధి

జిల్లాలో దేవదాయశాఖ పరిధిలో 1652 ఆలయాలు ఉంటే ఇందులో దేవదాయశాఖ పరిధిలోని ఈఓ. కింద 81 ఆలయాలు ఉన్నాయి. ఇందులో 85 మంది అర్చకులు,వందకుపైగా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అర్చకులకు ఓపిక, శక్తి ఉన్నంతవరకు అర్చకత్వం చేసుకునే అవకాశం దక్కింది. ఇక ఆలయాల్లో 100కుపైగా సిబ్బంది ఉన్నారు. వీరికి తాజా ప్రభుత్వ నిర్ణయం ఊరటనిచ్చింది. అర్చకులకు సంబంధించి నిర్ణయాలపై త్వరలో మార్గదర్శకాలను దేవదాయశాఖ కమిషనర్ కార్యాలయం విడుదల చేయనుంది.

జిల్లాలోని ఆలయాల వివరాలు

గ్రేడ్‌లు	ఆలయాల సంఖ్య
6 (ఎ)-2	4
6(బి)-2	13
6(సి)-1	29
6(సి)-2	1604
6(డి)	2

చరిత్రాత్మక నిర్ణయం



ఆలయాల్లో అనువంశిక హక్కులు కొనసాగించేలా నిర్ణయించడంతో పాటు ఓపిక,శక్తి ఉన్నంతవరకు ఆలయాల్లో పని చేసేలా అర్చకులకు రిటైర్‌మెంటు లేకుండా చట్ట సవరణ చేసేలా నిర్ణయించడం నిజంగా చారిత్రాత్మకమే. దేవళ్లకు ఆగమశాస్త్రాల ప్రకారం నిత్యం పూజలు, అర్చనలు చేసే సంప్రదాయం కొనసాగనుంది. సీఎంకు భగవంతుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయి.

– శివకుమార్, రాము, ప్రసాద్, అపన్నప్రదీప బ్రాహ్మణ సేవా సంఘం, మదనపల్లె

సీఎం నిర్ణయం సాహసోపేతం



ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అర్చకుల సంక్షేమానికి తీసుకున్న నిర్ణయం నిజంగా సాహసోపేతం. వంశపారంపర్యహక్కు పునరుద్ధరణతో అర్చక వ్యవస్థకు భవిష్యత్తులో యువత నుంచి ప్రోత్సాహం ఉంటుంది. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

– విశ్వేశ్వరప్రసాద్, ప్రధాన అర్చకులు, యోగభోగేశ్వరస్వామి ఆలయం, మదనపల్లె

ఆలయ వ్యవస్థ అభివృద్ధికి దోహదం



అర్చకుల పదవీ విర మణ వయస్సు పెంపు,వంశపారంపర్య హక్కుల పునరుద్ధ రణ తదితర ప్రభుత్వ నిర్ణయాలు జిల్లాలో దేవాలయాల వ్యవస్థ అభివృద్ధికి దోహదపడనున్నాయి. అర్చకుల్లో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

-విశ్వనాథ్, అసిస్టెంట్ కమిషనర్, దేవాదాయశాఖ

బాలశాస్త్రవేత్తలను ప్రోత్సహించండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈవో శ్రీరాం పురుషోత్తం, తదితరులు

రాయచోటిటౌన్: బాల శాస్త్రవేత్తలు భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సాహం అందించాలని అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరాం పురుషోత్తం పేర్కొన్నారు. శనివారం రాయచోటిలోని జిల్లా విద్యాశాఖ కార్యాయలంలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డితో కలిసి ఇన్‌స్పైర్ మనాక్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ 2023-2024 సంవత్సరానికి సంబంధించి నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ మనాక్ అవార్డుల పేరిట సైన్స్ పోటీలు నిర్వహిస్తోందని తెలిపారు. పోటీలకు ఈ నెల 31వ తేదీ లోగా నామినేషన్లు సమర్పించాలన్నారు. ప్రతి ఉన్నత పాఠశాల నుంచి 5 నామినేషన్లు, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి 3 నామినేషన్లు చొప్పున సమర్పించాలని చెప్పారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మాడి ప్రకాష్‌రెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు పూజారి రామయ్య, మొఘల్ షమ్ము, మయాన రియాజ్ అలీఖాన్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక పిల్ల మృతి



పెద్దతిప్పసముద్రం : అటవీ ప్రాంతం నుంచి జనారణ్యంలోకి ఓ జింక పిల్ల శనివారం వచ్చింది. స్థానిక పీహెచ్‌సీ వద్ద ఆ జింక పిల్ల సంచరిస్తుండగా.. కుక్కలు దాడి చేయడంతో మృతి చెందింది.

నవోదయలో విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డు ఏసీ పీఆర్ ప్రసాద్



ఓవరాల్ చాంపియన్ షిప్ దక్కించుకున్న కనూర్ క్లస్టర్ క్రీడాకారులు

నవోదయ విద్యాలయ లక్నో రీజియన్ రిటైర్డు ఏసీ ప్రసాద్

మదనపల్లె సిటీ : దేశ వ్యాప్తంగా ఉన్న నవోదయ విద్యాలయాల్లో విద్యతోపాటు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు నవోదయ విద్యాలయ లక్నో రీజియన్ రిటైర్డు అసిస్టెంట్ కమిషనర్ పీఆర్ ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక చిత్తూరు రోడ్డులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 34వ రీజినల్ అథ్లెటిక్స్ మీట్–23 ముగింపు కార్యక్రమం జరిగింది. విజేతలకు ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే ఉత్తమ భవిష్యత్తు ఉంటుందన్నారు. ముఖ్యంగా ఆత్మ స్థైర్యం నెలకొంటుందన్నారు. జాతీయ స్థాయికి ఎదగాలని సూచించారు. చదువుతున్న విద్యాలయాలకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. విద్యాలయాల్లో విశాలమైన గ్రౌండ్స్ ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గోవిందరావు, వైస్ ప్రిన్సిపల్ పద్మావతి, అధ్యాపకులు వెంకటరమణ, పీడీలు పాల్గొన్నారు.

విజేతలు వీరే : రీజినల్ అథ్లెటిక్స్ మీట్‌లో ఓవరాల్ చాంపియన్ షిప్‌ను కనూర్ క్లస్టర్ నవోదయ విద్యాలయం దక్కించుకుంది. రెండవ స్థానంలో కొప్పల్ క్లస్టర్ నిలిచింది. అండర్–19 బాలురు 400 మీటర్ల రిలే పరుగు పందెంలో చిత్తూరు మొదటి స్థానం కై వసం చేసుకుంది. రెండవ స్థానంలో కొప్పల, మూడవ స్థానంలో కొట్టాయం నిలిచింది. అండర్–17 బాలికల 400 మీటర్ల రిలే పరుగు పందెంలో కనూర్ విద్యాలయం మొదటి స్థానాన్ని వశం చేసుకుంది. రెండవ స్థానం కొట్టాయం, మూడవ స్థానం కొప్పల్ దక్కించుకున్నాయి.

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి



మృతి చెందిన గంగాధర్



గాయపడ్డ దినేష్

మరొకరికి తీవ్ర గాయాలు

కేవీపల్లె : ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని సారకాయలపేట చెరువు కట్ట సమీపంలో చోటు చేసుకుంది. వివరాలిలా వున్నాయి. రాయచోటి టౌన్ పాతరాయచోటికి చెందిన గంగాధర్ (28) శనివారం పీలేరుకు అత్తగారింటికి వెళ్లి తిరిగి రాయచోటికి ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. మార్గంమధ్యలోని సారకాయలపేట చెరువు కట్ట వద్ద ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగాధర్ మృతి చెందగా, అతనితోపాటు వచ్చిన బంధువు దినేష్ (17) తీవ్రంగా గాయపడ్డాడు. దినేష్‌ను చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. గంగాధర్‌కు భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేవీపల్లె పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నక్షత్ర తాబేలు లభ్యం



బి.కొత్తకోట : మండలంలోని కాండ్లమడుగు–అమరనారాయణపురం మధ్యలో పొలాల్లో నక్షత్ర తాబేళ్లు కనిపిస్తున్నాయి. శనివారం వైఎస్సార్‌సీపీ నాయకుడు కుమార్‌కు ఒక నక్షత్ర తాబేలు దొరికింది. దీన్ని హార్సిలీహిల్స్ అటవీ బీటు అధికారి జయరాంకు అప్పగించారు. తాబేలును జూ పార్కులో ఉంచుతామని జయరాం చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో..

చిట్వేలి : మండల పరిధిలోని మైలపల్లి దళితవాడ వద్ద ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. రైల్వేకోడూరు మండలం కమలానగర్‌కు చెందిన సిద్దమ్మ(33), భర్త చిన్నాతో కలిసి బుధవారం తండ్రి ఇంటికి వచ్చారు. కొంత కాలంగా భార్యాభర్తల మధ్య తగాదాలు ఉన్నాయని, బుధవారం నుంచి సిద్దమ్మ కనిపించడం లేదని ఆమె చెల్లెలు చెంచమ్మ చిట్వేలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సిద్దమ్మ చనిపోయిందని, ఎవరికీ తెలియకుండా మృతదేహాన్ని మామిడితోటలో పాతిపెట్టారని పోలీసుల విచారణలో వెల్లడైంది. శనివారం తహసీల్దార్ శిరీషా, డీఎస్పీ చైతన్య, సీఐ మధుసూదన్ రెడ్డి సమక్షంలో శవాన్ని వెలికితీసి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో..



లక్ష్మీనరసింహా(ఫైల్)

ఒంటిమిట్ట : మండల పరిధిలోని మృకుండాశ్రమం వద్ద శనివారం విద్యుత్ షాక్‌తో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ మధుసూదన్‌రావు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఒంటిమిట్ట పోలీసుస్టేషన్‌లో హోమ్ గార్డుగా పని చేస్తున్న నరికే వెంకట సుబ్బయ్య పెద్ద కుమారుడు లక్ష్మీనరసింహా(19) తిరుపతిలో ఇంటర్‌మీడియట్ చదువుతున్నాడు. సెలవులకు ఒంటిమిట్టలోని మృకుండాశ్రమం వద్ద ఉన్న తన ఇంటికి వచ్చాడు. శనివారం నేరేడు పండ్ల కోసం ఇంటి సమీపంలో ఉన్న చెట్టు దగ్గరకు ఇనుప కడ్డీతో చేసిన దోటిని తీసుకువెళుతుండగా.. కిందనే ఉన్న విద్యుత్ తీగలు తగిలాయి. ఇనుప కడ్డీకి విద్యుత్ ప్రసరించి షాక్ తగలడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే కడప రిమ్స్‌కు తీసుకువెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంకట సుబ్బయ్యకు ఇద్దరు కూతుర్లు, ఇద్దరు కూమారులు ఉన్నారు. అందులో లక్ష్మీనరసింహా పెద్ద కుమారుడు. బాధిత కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నారు.

రైలు కింద పడి..



వేణు మృతదేహం

పుల్లంపేట : అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. పుల్లంపేట మండలంలోని కేతరాజుపల్లి గ్రామానికి చెందిన మడగలం వేణు (43) కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు తనను పట్టించుకోకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో జీవితం మీద విరక్తి చెంది పుల్లంపేట రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

వ్యక్తిపై దాడి



గాయపడ్డ హరినాథరెడ్డి

మదనపల్లె : ఓ వ్యక్తిపై యువకుడు దాడి చేసిన ఘటన శనివారం పట్టణంలో జరిగింది. నిమ్మనపల్లె మండలం తవళం పంచాయతీ జల్లావారిపల్లెకు చెందిన బి.హరినాథరెడ్డి(42) మదనపల్లెలోని శివాజీనగర్‌లో నివాసం ఉంటూ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. రెండు నెలల క్రితం ఉద్యోగం మానేసి సొంత గ్రామమైన జల్లావారిపల్లెలో కుటుంబంతో సహా నివాసం ఉంటున్నాడు. అతడి కుమార్తెలు మదనపల్లె జెడ్పీ హైస్కూల్‌లో చదువుతుండగా, శనివారం వారిని తీసుకువచ్చేందుకు స్కూల్ వద్దకు వెళ్లాడు. అదే సమయంలో అక్కడ పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన వినయ్ విద్యార్థినులకు తినుబండారాలు కొనిస్తుండగా, హరినాథరెడ్డి ప్రశ్నించాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ మొదలైంది. ఆవేశానికి లోనైన వినయ్ రాడ్‌తో హరినాథరెడ్డి తలపై కొట్టి గాయపరిచాడు. అనంతరం మద్దతుదారులతో కలిసి దౌర్జన్యం చేశాడు. దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితుడ్ని స్థానికులు స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చైన్ స్నాచింగ్

కడప అర్బన్ : కడపలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతంలో కిరాణా షాపు నడుపుతున్న రమాదేవి చైన్ శనివారం స్నాచింగ్‌కు గురైందని రిమ్స్ పీఎస్ సీఐ రామచంద్ర తెలిపారు. బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలోని నాలుగు తులాల బంగారు చైన్‌ను లాక్కొని పారిపోయారు.

అన్నమయ్య జన్మస్థలి అభివృద్ధిపై ఆశలు

టీటీడీ చైర్మన్‌గా భూమన నియామకంపై హర్షం



రాజంపేట : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి చైర్మన్‌గా భూమన కరుణాకర్‌రెడ్డి పని చేశారు. వైఎస్సార్ తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రెండో సారి ఈయన టీటీడీ పాలకమండలి చైర్మన్‌గా నియమితులయ్యారు. దీంతో శనివారం నియోజకవర్గంలోని నందలూరు మండలం ఈదరపల్లె గ్రామంలో గ్రామస్తులు రేణుకా ఎల్లమ్మకు పూజలు నిర్వహించారు. బీసీ బాలికల గురుకులం చైర్మన్ కనకరాజు ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు.

రాజంపేట నియోజకవర్గంలో తన మార్క్

గతంలో తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి చైర్మన్‌గా భూమన కరుణాకర్‌రెడ్డి రాజంపేట నియోజకవర్గంలో తన మార్క్‌ను చూపించారు. తాళ్లపాక అన్నమాచార్యులు జన్మస్థలి తాళ్లపాకకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. 108 అడుగుల అన్నమయ్య విగ్రహం ఏర్పాటు, అన్నమయ్య 600 జయంత్యుత్సవాలు నభూతో నభవిష్యత్తు అనే రీతిలో నిర్వహించారు. దళిత గోవిందం లాంటి కార్యక్రమానికి తాళ్లపాకలో శ్రీకారం చుట్టారు. కళ్యాణమస్తు లాంటి మరెన్నో భూమన మార్క్‌ను గుర్తు చేస్తున్నాయి. రెండవ సారి టీటీడీ చైర్మన్‌గా భూమన కరుణాకర్‌రెడ్డిని నియమించడంతో నందలూరు, తాళ్లపాక, రాజంపేట వాసుల్లో ఆనందోత్సవాలు వెల్లివిరిస్తున్నాయి. అన్నమయ్య జన్మస్థలి అభివృద్ధిపై ఆశలు మరింతగా చిగురించాయి.



108 అడుగుల అన్నమయ్య విగ్రహం (ఇన్‌సెట్) భూమన కరుణాకర్‌రెడ్డి

మతిస్థిమితం లేని వ్యక్తికి ఏపీఎన్‌ఆర్‌టీఎస్ సాయం

కువైట్ నుంచి స్వదేశానికి తీసుకొచ్చిన వైనం



కువైట్‌లోని ఆసుపత్రిలో యానాదిరెడ్డిని పరామర్శిస్తున్న ఎం.బాలిరెడ్డి

కడప కార్పొరేషన్ : మతిస్థిమితం లేని వ్యక్తిని భారతదేశానికి తీసుకురావడానికి ఏపీఎన్‌ఆర్‌టీఎస్ సాయపడింది. వివరాలిలా ఉన్నాయి. అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం అనంతసముద్రానికి చెందిన ఆకేపాటి యానాదిరెడ్డి 20 ఏళ్లక్రితం జీవనోపాధి కోసం కువైట్ వెళ్లాడు. ఎయిర్ కండీషన్(ఏసీ) కంపెనీలో హెల్పర్‌గా పని చేస్తున్నాడు. ఈ ఏడాది మార్చి 26న పని చేస్తూ పెద్ద నిచ్చెనపై నుంచి కిందపడి తలకు గాయమవడమేగాక, వెన్నుపూస దెబ్బతినింది. తలకు దెబ్బ తగలడం వల్ల మతి స్థిమితం కోల్పోయాడు. తన వాళ్లను కూడా గుర్తించని స్థితిలోకి వెళ్లిపోయాడు. నాలుగు మాసాలైనా పరిస్థితిలో మార్పు రాకపోవడంతో ఆయన తమ్ముడు నరసారెడ్డి స్వదేశానికి తీసుకురావాలని నిర్ణయించుకున్నాడు. అయితే ఆసుపత్రిలో చికిత్సకు అయిన డబ్బు కట్టి డిశ్చార్జి చేసుకొని పోవాలని యాజమాన్యం చెప్పడంతో ఏం చేయాలో అర్థం కాక వైఎస్సార్‌సీపీ కువైట్ కన్వీనర్ ఎం.బాలిరెడ్డిని కలిసి పరిస్థితిని వివరించారు. ఆయన భారత రాయబార కార్యాలయ అధికారులతో మాట్లాడి పేదవారు అయినందున ఆసుపత్రి ఫీజు మాఫీ చేయించారు. ఈ సందర్భంగా యానాదిరెడ్డి తమ్ముడు నరసారెడ్డి మాట్లాడుతూ ఏపీఎన్‌ఆర్‌టీఎస్ ద్వారా ప్రవాసాంధ్రుల సమస్యలు పరిష్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, భారత రాయబార అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. చెన్నై నుంచి వేలూరు వరకూ ఉచిత అంబులెన్స్ ఏర్పాటు చేసిన ఏపీఎన్‌ఆర్‌టీఎస్ చైర్మన్ మేడపాటి వెంకట్, సీఈఓ హేమలత, డైరెక్టర్ ఇలియాస్, భారత ఎంబసీలో పేపర్ వర్క్ పూర్తి చేసిన సామాజిక కార్యకర్త రెడ్డెయ్యరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

సారా రహిత జిల్లాగా మారుస్తాం



జిల్లా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.ఆయేషా బేగం

రాయచోటి : సారా రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తానని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.ఆయేషాబేగం అన్నారు. శనివారం అన్నమయ్య జిల్లా రాయచోటి ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఆమె బాధ్యతలు చేపట్టారు. అనంతరం మర్యాద పూర్వకంగా ప్రభుత్వ విప్ గడికోట శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా పరిధిలో నాటుసారా విక్రయాలపై ప్రత్యేక దాడులు నిర్వహిస్తామన్నారు. సారా తయారీదారులను గుర్తించి వారిలో పరివర్తనను తెస్తామన్నారు. వారికి ఉపాధి మార్గాన్ని చూపించేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

పీజే సినిమాను ఆదరించండి



షూటింగ్‌లో పాల్గొన్న నటులు, డైరెక్టర్, యూనిట్ సభ్యులు

రాయచోటి టౌన్ : పీజే సినిమాను ఆదరించాలని ఆ సినిమా యూనిట్ సభ్యులు కోరారు. శనివారం రాయచోటి శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో పీజే సినిమా షూటింగ్ పూర్తి చేసుకొంది. ఈ సందర్భంగా యూనిట్ సభ్యులతోపాటు రాయచోటి సామాజిక సేవా కార్యక్రమాల సభ్యుడు వినయ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పీజే సినిమాలో రాయచోటికి చెందిన యువకుడు భరత్ హీరోగా నటించాడని చెప్పారు. ఈ సినిమాను విజయవంతం చేసి, భరత్ హీరోగా నిలదిక్కొనేలా అందరూ సహకరించాలని కోరారు. ఈ సినిమా అక్టోబర్ నెలలో విడుదలకు సిద్ధంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సంతోష్‌కుమార్, హీరోయిన్ ప్రీతిరెడ్డి, నిత్యశ్రీ, జబర్దస్త్ అప్పారావు, నటి శృతి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పనలో విఫలం



మాట్లాడుతున్న ఏపీ మహిళా సమైక్య రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి

రాయచోటి అర్బన్ : మహిళలకు రక్షణ కల్పనలో పాలకులు వైఫల్యం చెందారని ఏపీ మహిళా సమైక్య రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి విమర్శించారు. శనివారం స్థానిక ఎన్‌జీఓ సభా భవనంలో మహిళా సమైక్య జిల్లా స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాలలో మహిళలకు సమాన ప్రాతినిధ్యంతోపాటు నిర్ణయాధికారంలో భాగస్వామ్యం కల్పించడంతో విఫలమయ్యారన్నారు. నేటికీ మహిళలపై హింస, అత్యాచారాలు, అన్యాయాలు, లైంగిక వేధింపులు, వివక్ష కొనసాగుతూనే ఉన్నాయన్నారు. సంఘటిత, అసంఘటిత రంగాలలో పని చేస్తున్న మహిళలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా మహిళల పైన జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సమైక్య నాయకురాలు మర్రి సుమిత్ర, నాయకురాళ్లు సునీత, అరుణ, సుబ్బమ్మ, క్రిష్ణవేణి, శోభరాణి, సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రామిక విముక్తి యోధుడు ఫ్రెడరిక్ ఎంగెల్స్

శ్రామిక విముక్తి కోసం నిరంతరం పోరాటం చేసిన యోధుడు ఫ్రెడరిక్ ఎంగెల్స్ అని సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.యల్.నరసింహులు అన్నారు. ఫ్రెడరిక్ ఎంగెల్స్ 128వ వర్ధంతి సభను శనివారం స్థానిక ఎన్‌జీఓ సభా భవనంలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్మనీలో ఉన్నత పారిశ్రామిక కుటుంబంలో జన్మించినప్పటికీ కార్ల్ మార్క్స్‌తో కలసి అనేక సిద్ధాంత గ్రంథాలను రచించాడన్నారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమైక్య రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి, అన్నమయ్య జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, విశ్వనాథనాయక్, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధిక్యంలో సౌత్‌జోన్ జట్టు



కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–19 మల్టీడేస్ జోనల్ మ్యాచ్‌లు ఉత్సాహంగా సాగుతున్నాయి. పోటీల్లో భాగంగా రెండో రోజు శనివారం 206 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన సెంట్రల్‌జోన్ జట్టు 311 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని గీత్ 74 పరుగులు చేశాడు. సౌత్‌జోన్ బౌలర్ ప్రణవ్‌రెడ్డి 5 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌత్‌జోన్ జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 61 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 324 పరుగులు చేసింది. జట్టులోని సాయిసూర్యతేజారెడ్డి 78 బంతుల్లో 10 ఫోర్లు, 10 సిక్సర్లతో 132 పరుగులు చేశాడు. సెంట్రల్ జోన్ బౌలర్లు ఆదిత్యారెడ్డి 2, హర్షవర్ధన్ 2, అభినవ్ 2 వికెట్లు తీశారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్‌జోన్ జట్టు 167 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.